ఇబ్బందులు తలెత్తనీయొద్దు

పటాన్‌చెరు: వినాయక చవితి పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలోని సాకి చెరువు వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఉదయం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గజ ఈతగాళ్లు, క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బల్దియా ఏఈ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

పటాన్‌చెరు: మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ సమీపంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణహిత మట్టి వినాయకులను పూజించడం ద్వారా చెరువులను కాలుష్యం నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డబ్ల్యూఈడీపీ

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (డబ్ల్యూఈడీపీ) మంగళవారం విజయవంతంగా ముగిసింది. భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డెవలప్‌మెంట్, నీతిఆయోగ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని యువ, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభావవంతమైన చొరవగా అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మండపాలను విద్యుత్ తీగల కింద ఏర్పాటు చేయొద్దు

విద్యుత్ శాఖ సీజీఎం కామేష్

చందానగర్ : వినాయక మండపాలను విద్యుత్ లైన్ల కింద ఏర్పాటు చేయొద్దని విద్యుత్ శాఖ సీజీఎం కామేష్ పేర్కొన్నారు. మంగళవారం చందానగర్ గంగారం చెరువును ఎస్ఈ రవికుమార్, డీఈ, ఏడీఈ హరికృష్ణలు గంగారం చెరువు వద్ద ఉన్న కోనేరును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక విద్యుత్ వైరింగ్‌ను ఎంసీబీతో అనుసంధానం చేయాలన్నారు. ఐఎస్ఐ బ్రాండు తీగలు వినియోగించాలని, వైర్లకు అతుకులు లేకుండా ఇన్సులేషన్ టేపు వేయాలన్నారు. వినాయక ప్రతిమాలు మండపానికి తెచ్చే సమయంలో, నిమజ్జనానికి తరలించే సమయంలోను విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు.

గచ్చిబౌలి, ఇందిరానగర్, కొండాపూర్ ప్రాంతాలలో విగ్రహాలు, పూలు,పండ్లు అమ్మకాలు





పండగ సందడి



కాలనీలు, బస్తీల్లో గణేష్ మండపాలు సిద్ధం

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి: వినాయకచవితి వేడుకలకు సర్వం సిద్ధమైంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని కాలనీలు, బస్తీలలో వాడవాడలా వినాయక మండలపాల సందడి కనిపిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో కూడా వినాయక విగ్రహాల ఏర్పాటునకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. పండగను పురస్కరించుకుని పత్రి, పూలు, పండ్లు, డెకరేషన్ వస్తువులకు గిరాకీ పెరిగింది. రెండు రోజులుగా చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, లింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, కొత్తగూడ, మాదాపూర్ ప్రాంతాలలో నెలకొంది.

ఏర్పాట్లు పూర్తి

వాడవాడలా గణేష్ మండపాల ఏర్పాటుకు స్థానిక యువకులు, చిన్నారులు, కాలనీవాసులు సమిష్టిగా కృషి చేస్తున్నారు. అయిదు, ఏడు, తొమ్మిది, పదకొండు రోజులపాటు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. మట్టి వినాయకులనే పూజించేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. కాలనీలు, బస్తీలలో మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.





లింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతాలలో ..



మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



రాజీవ్‌గృహ కల్పలో.. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



రాయదుర్గంలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

శేరిలింగంపల్లి/రాయదుర్గం: వాడవాడలా మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్‌నగృహ కల్పలో మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మట్టి వినాయకులను పూజించాలని కోరారు. రాయదుర్గంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటువద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

సుదర్శన్‌నగర్‌లో.

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ సుదర్శన్‌నగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సింగదాసరి రాజశేఖర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మల్లేష్ యాదవ్, చంద్రశేఖర్, వినయ్‌యాదవ్ పాల్గొన్నారు.

వరదనీటి కాలువ పనుల్లో వేగం పెంచాలి

మియాపూర్: వరదనీటి కాలువ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి బొల్లారం మెయిన్ రోడ్డు వరకు రూ. 1 కోటి 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన నీటి కాలువ పనులను కార్పొరేటర్ ఉప్పల పాటి శ్రీకాంత్, ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని పనులలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్ రెడ్డి , డీజీఎం శరత్‌రెడ్డి , మేనేజర్ సునీత, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ సంతోష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఎలక్ట్రికల్ ఏఈ రవిచంద్ర, నాయకులు పాల్గొన్నారు.



ఏపీఏఎం విద్యావేత్తగా ప్రొ. ఘనశ్యామ్ కృష్ణ

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అరుదైన అవకాశం



రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ ఎం ఘనశ్యామ్‌కృష్ణ ఆసియా పసిఫిక్ అకాడమీ ఆఫ్ మెటీరియల్స్(ఏపీఏఎం) విద్యావేత్తగా ఎన్నికయ్యారు. ఆయన స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సీనియర్ ప్రొఫెసర్. సన్నని ఫిల్మ్‌లు, నానోస్ట్రక్చర్డ్ మెటీరియల్స్, సెన్సార్ల రంగాలపై ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. ఏపీఏఎం అనేది ఆస్ట్రేలియా, రష్యా, భారతదేశం, చైనా, జపాన్, కొరియా, తైవాన్, సింగపూర్, హాంకాంగ్, మంగోలియా, ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ దేశాల సభ్యులతో ఏర్పడిన సంఘం. 20 మంది పీహెచ్‌డీ విద్యార్థులను పర్యవేక్షించారు. ప్రస్తుతం హెచ్‌సీయూలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు అభినందించారు.

'మనూటా' నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



రాయదుర్గం: 'మనూ' టీచర్స్ అసోసియేషన్ (మనూటా) కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్‌అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. 2025–27 కాలపరిమితితో కూడిన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా డాక్టర్ షబానాకేసర్, ఉపాధ్యక్షుడుగా డాక్టర్ సలావుద్దీన్ సయ్యద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశ్వని, కోశాధికారి చావ్లా ముత్యాలరావు, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ సమద్‌తజే వడక్కయిల్, జాయింట్ సెక్రెటరీ పబ్లిసిటీ ముజాహిద్ పాషా సయ్యద్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ టీచర్లు అంతా బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించడంతోపాటు విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి ఇష్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ లంకాల, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ షిరిన్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిదులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



వడ్డెర బస్తీలో పర్యటిస్తున్న సీఎండీ ముష్రఫ్ ఫరూకీ

టీజీఎస్‌డీపీఎల్ సీఎండి ముష్రఫ్ ఫరూకీ

గచ్చిబౌలి: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలను తీసుకోవాలని టీజీఎస్‌డీపీఎల్ సీఎండి ముష్రఫ్ ఫరూకీ అధికారులను ఆదేశించారు. వైట్‌ఫీల్డ్ సెక్షన్ పరిధిలోని వడ్డెరబస్తీలో బస్తీబాటలో భాగంగా మంగళవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ముష్రఫ్ ఫరూకీ మాట్లాడుతూ నిరంతర విద్యుత్ సరఫరా అందించాల్సిన బాధ్యత సంబంధిత ఇంజనీర్లపై ఉందన్నారు. విద్యుత్ సురక్షా చర్యలను ఖచ్చితంగా అ మలు చేయాలని, అపఘాతాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ డైరెక్టర్ నర్సింహులు, సీఈ పాండ్యా నాయక్, ఎస్ఇ చంద్రశేఖర్, డీఈ శ్యాంకుమార్, ఏడీఈ కమలాకర్, ఏఈ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



క్రిస్టియన్ శ్మశానవాటికలో మొక్క నాటుతున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ శ్మశానవాటికలో జరిగిన వన మహోత్సం కార్యక్రమంలో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్ల జాతుల మొక్కలు నాటి ప్రజలకు ఉపయోగపడేలా సంరక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ దేవజ, మేనేజర్ శివజ్యోతి, సూపర్‌వైజర్ నాగరాణి, నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మల్లేష్, మహేష్, గోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గాంధీ సర్కిల్ నుండి గోనెమ్మ దేవాలయం వరకు చేపడుతున్న రహదారి విస్తరణ, సీసీ రోడ్డు పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ.ఒక కోటి 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారిని విస్తరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి కొత్తకుంట చెరువు



పీజేఆర్ స్టేడియంలో బేబి పాండ్



బస్ టాయిలెట్స్



గణనాథుల నిమజ్జన ఏర్పాట్లు షురూ..

- చందానగర్ సర్కిల్ పరిధిలో 6 పాయింట్లు
- ఏర్పాట్లకు రూ.47.30 లక్షలు నిధులు
- పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత



చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు కోనేరు

చందానగర్: వినాయక చవితి పండగను పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని గణనాథుల విగ్రహాల నిమజ్జనానికి కోనేరులను శుభ్రం చేసి ముస్తాబు చేస్తున్నారు. సర్కిల్ 21 పరిధిలో 6 నిమజ్జనం పాయింట్‌లు ఏర్పాటు చేశారు. 3 కోనేరులు , రెండు చెరువులు, ఒకటి తాత్కాలికంగా నిర్మిస్తున్నారు. కోనేరుల వద్దకు వచ్చే భక్తులకు కావలసిన వసతులపై అధికారులు దృష్టి సారించారు.

నిమజ్జన ప్రాంతాలివే..

సర్కిల్ 21 పరిధిలో చందానగర్ గంగారం పెద్ద చెరువు, హఫీజ్‌పేట్‌లోని కాయిదమ్మకుంట చెరువు, దీప్తిశ్రీనగర్‌లోని రేగులకుంట, మియాపూర్ గురునాథం చెరువుల వద్ద కోనేరులు, కొత్తకుంట చెరువులో కేవలం మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనం, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో తాత్కాలికంగా చిన్న విగ్రహాల కోసం ప్రత్యేకంగా బేబీ పాండ్ ఏర్పాటు చేస్తున్నారు.

- చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఏర్పాట్లకు రూ.47.30 లక్షలు
- వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కోనేరులలో బోర్ల ద్వారా, ట్యాంకర్ల ద్వారా మంజీరా నీటితో నింపుతున్నారు.
- పెద్ద విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా గంగారం చెరువు వద్ద రెండు, కాయిదమ్మకుంట వద్ద రెండు, కొత్తకుంట వద్ద ఒకటి, గురునాథం చెరువు వద్ద ఒక్క క్రేన్‌ను ఉంచనున్నారు.
- కోనేరుల వద్ద దీపాల ఏర్పాటు.. బస్ టాయిలెట్స్ అందుబాటులో ఉంచనున్నారు.
- జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సూపరింటెండెంట్‌లతో ఎప్పటికప్పుడు నిమజ్జనాన్ని పర్యవేక్షించడానికి టీంలను ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రతి నిమజ్జనం పాయింట్ వద్ద ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. పోలీస్ బందోబస్తు
- 24 గంటల పాటు కోనేరు వద్ద జీహెచ్ఎంసీ, పోలీస్, విద్యుత్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

నిమజ్జనాలకు 6 పాయింట్‌లు



చందానగర్ సర్కిల్– 21 పరిధిలో గణనాథుల నిమజ్జనం కోసం 6 పాయింట్‌లున్నాయి. కోనేరుల వద్ద వసతులు, క్రేన్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 24 గంటల పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది అందుబాటులో ఉంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

–శశిరేఖ, ఉప కమిషనర్, సర్కిల్ –21 ,చందానగర్

డీజేకి అనుమతి లేదు



వినాయక మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టమ్‌కు అనుమతి లేదు. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంగారం చెరువు, పీజేఆర్ స్టేడియం, నల్లగండ్ల, గోపినగర్ చెరువుల వద్ద 24 గంటల పాటు భద్రత ఏర్పాటు చేస్తున్నాం. వీధులలో ఏర్పాటు చేసే గణనాథుడి సమాచారం తప్పనిసరిగా పోలీసులకు అందించాలి. ప్రతి వినాయక మండపానికి జియో ట్యాగింగ్ చేస్తున్నాం.

–సుంకరి విజయ్, ఎస్‌హెచ్‌ఓ, చందానగర్ పీఎస్

సేవారత్న అవార్డుల ప్రదానం



మాదాపూర్: పేదలు, వయోవృద్ధులకు మదర్ థెరిస్సా సేవలందించారని ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని స్వాతి హైస్కూల్‌లో మదర్ థెరిసా సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. వివిధ రంగాలలో సేవలందించిన 5గురికి సేవారత్న అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో రాగం మల్లికార్జున యాదవ్, స్వాతి స్కూల్ కరస్పాండెంట్ వి.ఫణికుమార్, ఎం.బసవలింగం, సత్యసాయి సేవాసమితి సభ్యులు డాక్టర్ రామన్న, బివికే రావు పాల్గొన్నారు.

ఆర్చరీ క్రీడాకారిణికి ఘన సత్కారం



మాదాపూర్: ప్రపంచ ఆర్చరీ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తెలంగాణ రైతుబిడ్డ చికితా తానిపర్తిని కె రహేజా కార్పొరేషన్ సీఓఓ శ్రావణ్‌కుమార్ గోనే మంగళవారం ఘనంగా సత్కరించారు. కెనడాలో ఆగస్టు 19 నుంచి 26వ తేదీ వరకు జరిగిన విన్నిపెగ్ 2025 వరల్డ్ యూత్ ఛాంపియన్‌షిప్‌లో యు–21 మహిళల కాంపౌండ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. భారతదేశపు మొదటి మహిళా కాంపౌండ్ ఆర్చర్‌గా చరిత్ర సృష్టించింది. కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు మయూర్ పట్నాల, ఇనార్బిట్‌మాల్ వైస్‌ప్రెసిడెంట్ శరత్ బేలవాడి పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఎమ్మెల్యే కృష్ణారావు ఆధ్వర్యంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు.

ఆర్ట్‌గ్యాలరీలో గణేష్ చిత్రప్రదర్శన





మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మంగళవారం ఏర్పాటు చేసిన గణేష్ స్పాట్ పెయింటింగ్ ప్రదర్శనను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మి ప్రారంభించారు. గణేశ్ చతుర్థి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 33 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈనెల 27వ తేదీ చివరి రోజు గెలుపొందిన కళాకారులకు నగదు బహుమతులను అందజేయనున్నట్టు తెలిపారు. మట్టి గణపతులను పంపిణీ చేశారు.